# అనగా అనగా

అనగా అనగా ఓ ఊరు.

ఆ ఊరిలో ఓ విశాలమైన భవనం.

ఆ విశాలమైన భవనం ముందు అందమైన పూలతోట.

ఆ అందమైన పూలతోట చుట్టూ ఎత్తైన ప్రహరి.

ఆ ఎత్తైన ప్రహరి గుండా లోపలికి వెళ్ళడానికి ఓ బలమైన పెద్దగేటు.

ఇక, ఆ బలమైన పెద్దగేటును దాటి అందమైన పూలతోటలో గుండా విశాలమైన భవనంలోకి వెళితే... అక్కడ నివసిస్తోన్న అన్యోన్యమైన యువజంట కనిపిస్తారు.

ఆకర్షణీయమైన యువకుడికి అందమైన యువతి భార్య. ఆ ఇరువురి అనురాగమయ సంసార జీవితానికి ప్రతీక ముద్దులు మూటగట్టే ముచ్చటైన పాపాయి.

వీరు ముగ్గురే కాకుండా...అణుకువ కలిగిన పనిమనిషి, విధేయుడైన వంటమనిషి ఆ భవనంలో నివసిస్తున్నారు.

ఇంకా ఆ ఇంటికి అప్పుడప్పుడూ... ఆ అందమైన యువతిని ఆప్యాయంగా ఆదరించే అత్తామామలు, ఆ ఆకర్షణీయమైన యువకుడిని ఆత్మీయంగా ఆదరించే అత్తామామలు...వస్తూ వుంటారు. కొన్నిసార్లు కలిసి వెళ్తూ వుండేవారు. కొన్నిసార్లు ఓ పూటో అరపూటో గడిపి వెళ్తూవుండేవారు.

కానీ, చిట్టిపాప పుట్టాక వారి ధోరణి మారింది.

యువకుడి వైపు మూడు తరాల్లోనూ తీరని ముచ్చట తీర్చడానికి అన్నట్లు పుట్టిన మొదటి ఆడపిల్ల. అందుకే ఆ యువకుడి అమ్మానాన్నలు పాపాయిని క్షణం విడిచివుండలేకున్నారు.

దాదాపు పాతికేళ్ళ తరువాత మళ్ళీ ఆ యువతి పసితనానికి ప్రతిబింబం లాగున్న ఆ అందాల పాపాయిని వదిలి వెళ్ళలేకున్నారు యువతి అమ్మానాన్నలు.

పాపతో వారి అనుబంధాన్ని గుర్తించిన ఆ ఆకర్షణీయమైన యువకుడు తన అత్తామామలను అక్కడే వుండిపొమ్మని కోరాడు.

ఇక ఆ అందమైన యువతి తన అత్తామామలను తనకు ఆసరాగా వుండి పొమ్మని ప్రార్థించింది.

అందరి ఆమోదంతో ఆ ఆదర్శప్రాయమైన కుటుంబంలో ఆనందం చిప్పిల్లింది. అనురాగం ఉప్పొంగింది.

ఎటొచ్చి, ఇంకొక అణుకువ కలిగిన పనిమనిషిని కుదుర్చుకోవాల్సివచ్చింది.

అలాగే విధేయుడైన వంటమనిషికి విధేయుడైన సహాయ వంటమనిషిని కుదర్చాల్సి వచ్చింది. అన్నీ సవ్యంగా జరిగిపోయాయి.

ఆ విశాలమైన భవనంలో అన్యోన్యమైన యువజంట - ముద్దులు మూటగట్టే చిట్టిపాప - ఆప్యాయత కురిపించే యువకుడి అమ్మానాన్నలు - ఆత్మీయంగా ఆదరించే యువతి అమ్మానాన్నలు - అణుకువ కలిగిన పనిమనుషులు - విధేయులైన వంట మనుషులు - అందరూ ఎంతో సంతోషంగా జీవిస్తున్నారు.

అలా అలా కాలం గడవగా ....గడవగా...

చిట్టిపాప మొట్ట మొదటి సారిగా గడప దాటింది.

ఆ విశేషాన్ని మొదట గమనించింది - ఆ పాపను అనుక్షణం అంటి వుండే అమ్మమ్మ నాన్నమ్మలు. వారు తమ వయసును కూడా మర్చిపోయి హుషారుగా చప్పట్లుకొడుతూ పెరిగెత్తుకు వెళ్ళి తాతయ్యలను పిలుచుకువచ్చారు.

ఆ హడావుడికి అందమైన యువజంట రానేవచ్చారు.

బుజ్జితల్లి ఘనకార్యానికి అందరూ ఆనందంతో గెంతులు వేసారు.

పాపాయి గడపలు దాటేస్తుందని గబగబ గారెలు వండేసాడు విధేయుడైన వంట మనిషి. ఓ తట్ట నిండా జీడిపప్పు తెచ్చి దిష్టితీసారు తాతయ్య లిద్దరూ.

అణుకువ గల పనిమనుషులు ఆనందంగా అవ్వన్నీ అందరికీ పంచివచ్చారు. అలాగే నానమ్మ స్వయంగా చేసిన అరచేయంత అరిసెలను కూడా.

ఇక పాప ఇంటి గోడల మధ్య నుంచి ఇంటి ముందున్న అందమైన పూలతోట దాకా చురుకుగా అడుగులేసేస్తోంది.

పాపాయి బుడి బుడి నడకలకు మురిసిపోతూ - తాతయ్యలు పాప వెనకే గునగునా నడిచేస్తున్నారు. అమ్మమ్మ నాన్నమ్మలు కూడా నడుం బిగించి తాతయ్యలను అనుసరించారు.

పాపాయి పచ్చిక మీద పరుగులు పెడుతూ - పూపొదరిళ్ళలో దాగుడుమూత ఆడుతూ వారిని ఆటలు పట్టిస్తోంది.

తమ ముద్దుల కూతురు చిలిపితనాన్ని ఆ యువజంట ఎంతో మురిపెంగా చూసుకొంటున్నారు.

అణుకువగల పనిమనుషులు అయిదు నిమిషాలకు ఓ సారి మెటికలు విరుచుకొంటున్నారు. విధేయుడైన వంటమనిషి ఇరుగుపొరుగు పాపిష్టికళ్ళు పాపాయి మీద పడకుండా కాసేపటికి ఓ సారి గుప్పెడు ఉప్పుతీసి నిప్పు మీద పడేస్తున్నారు.

అలా అలా అందరూ ఆ విశాలమైన ఇంటిలో పాపాయి ఆటలు పాటలు మధ్య ఆనందంగా జీవిస్తున్నారు.

ఇంతలో పాపాయి చిలకపలుకులు పలకడం నేర్చింది.

ఎవరు నేర్పేరమ్మ ఈ బొమ్మకు తీపి మొలకమని పలుకు పలుకుకూ... అనుకొంటూ ఆ యువజంట ఆనందంతో ఆశ్చర్యపోయారు. పాపాయి అమ్మానాన్నలను వరుసపెట్టి పిలవడంతో వారి సంతోషం సాగరమైంది.

తాతయ్యల ఆనందానికి అవధులే లేవు.

అమ్మమ్మ నానమ్మలు మాటిమాటికి తమని పిలిపించుకొంటూ మురిసిపోతున్నారు.

విధేయుడైన వంటమనిషి పలుకుపలుకుకో పంచదారచిలక లెక్కన తయారుచేసాడు. అణుకువ గల పనిమనుషులు తెలిసిన వారందరికీ ఈ శుభవార్తతో పాటు పంచదార చిలకల్ని పంచివచ్చారు.

అమ్మమ్మ నానమ్మలు తమ గొంతులు విప్పి; తమ చిన్నతనంలో నేర్చిన చిట్టిపాటలు పాడడం మొదలెట్టారు. తాతయ్యలు కథల చిట్టా విప్పారు. ఇక, తాతయ్యల ట్వింకిల్‌స్టార్స్ - జింగిల్ బెల్స్ - అమ్మమ్మ నానమ్మల చిట్టి చిట్టి మిరియాలు - చిట్టి చిలకమ్మలు - చేత వెన్నముద్దలు పాపాయికి అన్నీ యిష్టమే.

పాపాయి రాగాల సాగరంలో ఈదులాడుతూ అందరూ ఆ యింటిలో ఆనందంగా కాలం గడుపుతున్నారు.

ఇంతలో పాపాయి ఎవరైనా చెప్పింది చెప్పినట్లుగా వప్పజెప్పె - ఎవరైనా చేసింది చేసినట్లు తిరిగిచేసే - కాలం వచ్చేసింది.

అది సరిగ్గా పాపాయికి ఏదైనా లలితకళను నేర్పించే సమయమని తాతయ్యలు తేల్చిచెప్పారు.

తనెంతో ప్రయాసపడినా తన కూతురు మూడురాగాలైనా తీయలేక పోయిందనీ తన ముద్దుల మనవరాలికి శాస్త్రీయసంగీతం నేర్పితే బావుంటుందని అమ్మమ్మ తన మనసులో ఎన్నాళ్ళుగానో దాచుకున్న కోరికను నెమ్మదిగా బయటపెట్టింది.

''పాపకు సంగీతం నేర్పించేద్దాం!'' అల్లుడు గారు అత్తకు వంతపాడారు.

''కుందనపు బొమ్మ లాంటి కూతురు కూచిపూడి చేస్తే కదా అందం'' అంది పాపవాళ్ళ అమ్మ.

''నిజమే!'' నానమ్మ తలాడించింది.

ఆ రోజు భోజనాల బల్ల దగ్గర పాపకు ఏం నేర్పించాలో అందరూ సావధానంగా చర్చించారు.

అమ్మమ్మ కోరినట్లుగా సంగీతం - అమ్మ అన్నట్లుగా నాట్యం నేర్పించాల్సిందే! మరి తాతయ్యలు ఏం కోరుకొంటున్నారో...!

''నేను నిన్ను టెన్నిస్ తారను చేద్దామనుకొన్నా. నీకు అసలు ఆటే వంట బట్టలేదు. కనుక పాపకు తప్పకుండా టెన్నిస్ నేర్పించాల్సిందే!'' తన కొడుకు వైపు చూస్తూ యువకుడి తండ్రి ప్రకటించేసాడు.

''ఈత నేర్పించాల్సింది కూడా ఈ వయసులోనే కదండీ బావగారూ!'' యువతి తండ్రి ఎంతో వినయంగా పాపకు ఈత నేర్పించాలన్న తన కోరికను వెలిబుచ్చాడు.

అన్యోన్యమైన యువజంటకు ఎవ్వరినీ నొప్పించడం ఇష్టం లేదు.

అందుకే ఆ మర్నాటి నుంచే సంగీతం మాష్టార్ని - డాన్స్ టీచర్ని రమ్మని చెప్పేసారు.

ఆ విశాలమైన ఇంటి ముందున్న అందమైన పూలతోటను టెన్నిస్ కోర్టుగానూ ఈతకొలనుగానూ మార్చేసారు. టెన్నిస్ నేర్పడానికి ఒక కోచ్‌ను, ఈత నేర్పడానికి ఒక కోచ్‌ను నియమించారు.

చిట్టిపాప బుడిబుడి నడకలన్నీ విశాలమైన భవనంలోనే నడుస్తోంది. తాతయ్యల హడావుడి గోడల మధ్యనే.

ఇక పాప సమయం పాప చేతుల్లోంచి - పాప అమ్మానాన్నల చేతుల్లోంచి - తాతయ్యల చేతుల్లోంచి - అమ్మమ్మ నానమ్మల చేతుల్లోంచి - మాష్టారు, టీచర్, కోచ్‌ల చేతులలోకి వచ్చేసింది.

పాపతల్లిని ఒకరోజు చెప్పలేనంత దిగులు కమ్మేసింది. ఈ వ్యవహారమంతా పాపకు వయసుకు మించిన భారం అవుతుందేమోనని యువకుడి భుజం మీద తలవాల్చి కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

యువకుడు తన భార్య భయాలన్నిటిని తేలికగా కొట్టి పారేసాడు.

'నువ్వు ఏమిటిలా బెంగపడిపోతున్నావ్? ఇపుడు మన ప్రపంచ టెన్నిస్

రాణి ఏ వయసులో ఆడడం మొదలెట్టిందో తెలుసా? కనీసం టెన్నిస్ రాకెట్ అంత అన్నా లేనపుడు ఇక మన క్రికెట్ చిచ్చర పిడుగు. క్రికెట్ బ్యాట్ ఎత్తు అన్నా లేనపుడు. ఇప్పుడు రెండేళ్ళకే ఈతలో రికార్డు - మూడున్నర ఏళ్ళకే కారు నడపడంలో రికార్డు - నాలుగేళ్ళకే వాటర్ సర్ఫింగ్‌లో రికార్డు - అయిదేళ్ళలోపే పియానో వాయించడంలో రికార్డు - ఆరేళ్ళకే కళ్ళకు గంతలతో కారు నడపడంలో రికార్డు - ఏడేళ్ళకే ఏరోప్లేన్ నడపడంలో రికార్డు - అన్నింటిలోనూ అతి పిన్న వయసులో రికార్డ్ - రికార్డ్ - రికార్డ్! మన బంగారు తల్లి మాత్రం ఎందులో తక్కువ? చిట్టి తల్లి ఏదో రికార్డ్ సాధించి తీరాలి. అదే మనం కోరుకోవాలి.''

''ఏదైనా... పాప నాకు దూరంగా .... ఇలా రోజంతా ఆటపాటలు లేకుండా.....తన ఈడు వాళ్ళతో కలవకుండా....'' తల్లి నసిగింది.

''అవే ఆటలు పాటలు కదా... మళ్ళీ ప్రత్యేకంగా ఎందుకు? మన పాప అందరి కన్నా భిన్నమైందనీ ప్రత్యేకమైందనీ మనం నిరూపించుకోవాలి. ఏదో ఒక అంశంలోనో కాదు - అన్నింటిలో!'' యువకుడు అలా అంటూనే అతి పిన్న వయసులో అతి పెద్ద రికార్డుల సాధించిన వారందరి వివరాలు - వారు ఆర్జించిన ఖ్యాతి, సంపద, అన్నీ యువతికి తెలియజేసాడు. వారందరివీ పెద్ద పెద్ద బొమ్మలు తెచ్చి - గోడల మీద అంటించాడు.

యువతికి ఒక్కసారిగా తన అమాయకత్వం మీద తనకే నవ్వొచ్చింది.

నిజమే, ఆ మాత్రం శ్రమ పడకపోతే గొప్ప ఫలితాలు ఎలా దక్కుతాయి?

యువతి - పాప మాస్టారు, టీచర్, కోచ్‌లు సాధ్యమైనంత ఎక్కువగా పాపతో సమయం గడిపేట్లు ఏర్పాట్లు చేసింది.

వారందరిని విధేయుడైన వంటమనిషి తన చక్కని వంటతో సంతుష్టులను చేస్తున్నాడు. అణుకువ గల పనిమనుషులు అడిగి అడిగి మర్యాదలు చేస్తున్నారు.

పాప అంతర్జాతీయ ఖ్యాతిని పొందే శుభఘడియ కోసం యువజంట, తాతయ్యల జంట, అమ్మమ్మ నానమ్మలు, విధేయుడైన వంటమనిషి, అణుకువ గల పనిమనుషులు ఎంతో ఆత్రుతతో ఆనందంలో ఎదురు చూస్తున్నారు. అలాఅలా ఆనందంగా జీవిస్తున్నారు. ఇంతలో అక్కడ ఎక్కడో వున్న యువతి తమ్ముడు తన సెలవు రోజుల్లో ఆ విశాలమైన భవనంలో కొంత కాలం గడపడానికి వచ్చాడు. వస్తూ వస్తూ పాపకోసం బోలెడు బొమ్మలు, పుస్తకాలు, ఆటవస్తువులు, ఒక లిటిల్ ఏంజిల్ డ్రస్ - తెచ్చాడు. వచ్చీరాగానే పాప పుస్తకాలు చదవలేదని తెలుసుకొని బోల్డంత ఆశ్చర్యపోయాడు.

మూడేళ్ళ పిల్లని బడికి పంపకుండా ఇంకా ఇంట్లో వుంచుకోవడం ఏమిటని

తికమకపడ్డాడు. అందరూ ఇపుడు రెండేళ్ళు నిండీనిండగానే బడికి పంపిస్తోంటే తన అక్కయ్యేమిటి ఇంత ఆలస్యం చేసిందని ఆశ్చర్యపోయాడు. తనకు తెలియకపోతే పోయింది మీరెలా ఆలస్యం చేసారు బావగారూ! అంటూ వాపోయాడు.

అందరూ గొప్ప విచారంలో పడిపోయారు.

ఈ ఏడాదికి బళ్ళు తెరిచేసారు కనుక మరుసటి సంవత్సరం చేర్పించాల్సిందే ఎలా చెప్మా! అంటూ ఆలోచనలో పడ్డారు.

తాతయ్య లిద్దరూ సుడిగాలిలా ఓ సారి ఊళ్ళోని బళ్ళన్నీ తిరగేసివచ్చారు.

చివరికి ఒక బడిలో ఎంట్రెన్స్ - ఇంటర్వ్యూల నేపధ్యంతో సీటు ఇవ్వడానికి ప్రయత్నిస్తామన్నారు. అందరి మనసులు కుదుట పడ్డాయి.

వెంటనే ఓ పంతులమ్మను కుదిర్చి - పాపకు ఎంట్రన్స్ శిక్షణ ఇప్పించసాగారు.

చిట్టిపాప చిలకపలుకులతో చిన్ని పాఠాలు చక్కగా నేర్చుకుంటోంది.

అందరూ ఎంతో ఆసక్తిగా శ్రద్ధగా పాప పాఠాలు వల్లిస్తున్నారు.

సంగీతం టీచర్, డాన్స్‌మాస్టార్, స్విమ్మింగ్ కోచ్, టెన్నిస్ కోచ్‌లు మిగిల్చిన పాప సమయాన్నంతా పాఠాల పంతులమ్మకి కేటాయించేసారు.

అందరూ హాయిగా ఊపిరి పీల్చుకొన్నారు.

అలా అలా అందరూ ఆ విశాలమైన భవనంలో ఈత కొలను వద్దా టెన్నిస్ కోర్టు వద్దా - చదువుకొనే గది వద్దా - నాట్యం నేర్పేగది వద్దా - సంగీతం గది వద్దా - కాలం గడిపేస్తూ వున్నారు.

ఇలావుండగా ఒక రోజు కోచ్‌లు పాపాయికి ఇవ్వవలసిన పోషకాహారం గురించి సందేహంలో పడ్డారు.

యువకుడు వెంటనే ఒక పోషకాహార నిపుణిడ్ని నియమించేసాడు.

ఇక ఇపుడు విధేయుడైన వంటమనిషి పోషకాహార నిపుణిడి సలహా మేరకే వంట చేసి పెట్టాల్సి వస్తోంది.

పాపాయిని నిద్ర లేపే దగ్గర్నుంచి పడుకోబెట్టే వరకూ ఒక క్రమ బద్ధమైన నియమావళిని అనుసరించేందుకు వీలుగా ఆ యువకుడు ఒక అనుభవజ్ఞురాలైన కార్యదర్శిని నియమించాడు.

ఆవిడ సమయానికి తగ్గట్లు పాపను టెన్నిస్‌కో ఈతకో లేక సంగీతానికో

మరోదానికో చక్కగా తయారు చేసేది. అలాగే సంబంధిత టీచర్ వెంటనే పాపవద్దకు వచ్చేట్లు జాగ్రత్త తీసుకొనేది.

ఇక ఈవిడ మీద తాతయ్యల నిఘా.

అమ్మమ్మ నానమ్మలు సరేసరి.

పాప కాలు ఎత్తినా దించినా వారికి మురిపమే.

పాప టెన్నిస్ రాకెట్టు ఊద్వేగలుగుతున్నా - ఊతకొలనులో అరికాళ్ళు తడవనిస్తున్నా వారికి ముచ్చటగానే వుంటుంది.

పాప అడ్డదిడ్డంగా గెంతుతోంటే నాట్యమనీ ఏడున్నొక్క రాగం తీసినా సంగీతమని మురిసి పోతుంటారు - వారందరి కళ్ళముందు పాప సృష్టించబోయే రికార్డు-ఆర్జించబోయే అఖండమైన ఖ్యాతి - పాప సంబంధీకుల్లా తమకు అందబోయే గౌరవం - కదలాడుతున్నాయి.

వారు మరింత ఉత్సాహంగా తమ సమయాన్నంతా పాప సమయం ఒక్కక్షణం వృధా కానివ్వకుండా క్రమబద్ధం చేయడానికే వినియోగిస్తున్నారు.

ఎటొచ్చి, పాప చేసే కొన్ని పిల్ల చేష్టలు కాస్త ఇబ్బందిగానే తయారవుతున్నాయి. పాపకి అమ్మతో ఆడుకోవాలన్నా - నాన్నతో దోబూచులాడాలన్నా - తాతయ్యలతో గెంతులు వేయాలన్నా - అమ్మమ్మ నాన్నమ్మల వద్ద గారాలు పోవాలన్నా - ఎంతో ఇష్టం. అయితే పాప సమయపాలన అన్నిటికన్నా ముఖ్యం కనుక అవన్నీ ఎలా వీలవుతాయి?

అయితే కొన్ని ఇబ్బందుల్ని కార్యదర్శి పరిష్కరించేస్తోంది. చాకచక్యంగా.

పాపకి పచ్చికూరలు వగైరా తినిపించేపుడు కథలు చెప్పమని మారాం చేస్తుంది.

తాతయ్యలు కథలు కాకరకాయలతో పాప సమయం వృధా చేయవద్దని కార్యదర్శి ఖచ్చితంగా చెప్పేసారు.

అయినా, ఆ అనుభవజ్ఞురాలైన కార్యదర్శి పాపను చిన్నబుచ్చకుండా తాతయ్యలను నొప్పించకుండా అప్పుడప్పుడూ పాపకోరికను తీర్చేది.

పాపకు తన కార్యదర్శి చెప్పే లిటిల్ ఏంజిల్ కథ అంటే ఎంతో ఇష్టం

మిలమిల మెరిసే రెక్కలు విప్పి తారాలోకంలో విహరిస్తూ - తుమ్మెదరాగాల మధ్య పూల వర్షాల మధ్యా సీతాకోక చిలుకల రథాల మీద పయనిస్తూ - అద్భుతాలు చేసే లిటిల్ ఏంజిల్ అంటే పాపకి ప్రాణం.

పాప తల్లి తన తమ్ముడు పాపకు బహుమతిగా తెచ్చిన లిటిల్ ఏంజిల్

డ్రస్‌ను వేసినప్పుడల్లా - చిట్టిపాప తన కార్యదర్శిని మరీ మరీ అడిగి ఆ కథను చెప్పించుకొనేది. మెల్లిమెల్లిగా బుజ్జిపాప తనే ఓ లిటిల్ ఏంజిల్‌గానూ - తారల్లోకి - జాబిలి వద్దకు దూసుకుపోతున్నట్లుగానూ - ఆకాశంలో ఆనందంగా పల్టీలు వేస్తున్నట్లు గానూ - మేఘాల పరువులపై పరుగులు పెడుతున్నట్లుగానూ - ఇంద్రధనుసుల పైనుంచి జర్రున జారుతున్నట్లుగానూ - ఊహించుకోసాగింది.

అలా అలా అందరి ఆశలకూ ఆశయాలకు అతీతంగా పాప ఊహలు సాగుతుండగా...సాగుతుండగా...

ఒకరోజు....

యువజంట ఎక్కడికో షికారు కెళ్ళారు.

తాతయ్యలు బజారెళ్ళారు.

అమ్మమ్మ నాయనమ్మలు ఆవకాయ పెట్టడానికి అనువైన మామిడికాయలని నిర్ణయించడం ఎలాగో చర్చిస్తున్నారు.

విధేయుడైన వంటమనిషి వారి చర్చలకు తన అనుభవాలను జోడిస్తున్నాడు.

అణుకువ గల పనిమనుషులు ఆసక్తిగా వారి మాటలు వింటున్నారు.

అది పాప నాట్యం సమయం.

పాప ఆ రోజు తనకెంతో ఇష్టమైన లిటిల్ ఏంజిల్ దుస్తుల్లో వుంది.

కార్యదర్శి పాపను నాట్యానికి సిద్ధం చేయాల్సివుంది.

పాప ఆవిడతో దోబూచులాడుతూ మెట్లెక్కి తిన్నగా ఆ విశాలమైన భవనం పై భాగానికి చేరుకొంది.

కార్యదర్శి, ఆవిడ వెనుక డాన్స్‌టీచర్ పాపను వెతుకుతూ బయలుదేరారు.

భవనం పైకి చేరిన పాప నెమ్మదిగా పిట్టగోడ చివరిదాకా చేరుకొంది. సువిశాల సుందర ప్రపంచం ఒక్కసారిగా పాప కళ్ళముందుకు వచ్చింది.

పాప దృష్టి విశాలమైన భవనం మీదుగా ఈతకొలను మీదుగా టెన్నిస్ కోర్టు మీదుగా ఎతైన ప్రహరిని దాటి పక్కనున్న మైదానంపై నిలిచింది. ఆ మైదానంలో ఎవరో పిల్లలు ఆడుకొంటున్నారు. వాళ్ళ వురుకులు పరుగులు, నవ్వులు కేరింతలు, ఉల్లాసభరితమైన కేకలు పాపను ఆకర్షించాయి. వాళ్ళు ఎగరేస్తున్న రంగు రంగుల గాలిపటాలు నీలాకాశంలో పడవల్లా సాగుతున్నాయి.

పాప కళ్ళు విప్పార్చి వింతగా వినోదంగా చూస్తూ వుండిపోయింది.

పాపకి వాళ్ళతో పాటు పచ్చిక మీద పల్టీలు వేయాలనీ, ఇసుక గూళ్ళు కట్టాలనీ, గులకల గుట్టలు పేర్వాలనీ, దొంగాటలు ఆడాలనీ అనిపించింది.

ఇంతలో చల్లటి సాయంకాలం పోతూపోతూ నిండు చందమామని పంపించింది.

తారలతో నిండిన ఆకాశం - పండు వెన్నెల - పాప పరవశంతో కళ్ళు విప్పార్చి రెప్పవాల్చలేకపోయింది. ఏదో అద్భుతమైన అనుభవం పాపని ఆవహించింది.

ఇంతలో పాపని గట్టిగా పిలుస్తూ - మెట్ల మీదుగా - కార్యదర్శి వస్తుండడం వినిపించింది.

లిటిల్ ఏంజిల్ దుస్తుల్లో అప్పుడే విచ్చిన మల్లెమొగ్గలా వున్న పాప తన గుండెల నిండా ఊపిరి పీల్చుకొంది.

తళతళా మెరుస్తోన్న ఏంజిల్ రెక్కల్లా కుట్టిన చేతులను విప్పార్చి - అచ్చం లిటిల్ ఏంజిల్ లాగానే - ఓ అద్భుతమైన పక్షిలా .... తిన్నగా ...స్వేచ్ఛగా మైదానం మీదుగా ... తారల తీరాలు చేరాలని.... ఎగిరింది.

సరిగ్గా అప్పుడే యువజంట షికారు నుంచి తిరిగి వచ్చి, ఇంట్లోకి అడుగు పెట్టబోతున్నారు.

పాప కనకాంబరాల చెండులా నేరుగా వారి ముందు కొచ్చిపడింది.

యువతి కెవ్వున కేక వేసింది.

యువకుడు అప్పటి వరకు మిలమిలలాడుతోన్న లిటిల్ ఏంజిల్ లాగున్న రక్తపు ముద్దను చేతుల్లోకి తీసుకొని బయటకు పరిగెత్తాడు...

ఆయన వెనకే భీతిల్లిన యువతి....

ఆవిడ వెనక తత్తరిల్లిన తాతయ్యలు...

తల్లడిల్లిన అమ్మమ్మ నాయనమ్మలు...

విలవిలలాడిన కార్యదర్శి....గాబరాపడిన పంతులమ్మ, మాస్టారు, టీచర్, కోచ్‌లు పనిమనుషులు...అందరూ .....అందరూ.....

పరుగులు తీసారు....

పాప ఆసుపత్రికి.....!

కథ కంచికి.......!!

మరి మనం....???

★ ★ ★

{ ౨ ఫిబ్రవరి 97
{ ఆంధ్రజ్యోతి ఆది.సం